
వైసీపీ వీరాభిమాని.. రిమ్స్ సూపరింటెండెంట్‌పై విచారణ



- జగన్ ప్రభుత్వంలో వైసీపీకి సలాం
- ఎన్నికల్లోనూ అదే ధోరణి
- ఎమ్మెల్సీ ఫిర్యాదుతో విచారణకు ప్రభుత్వం ఆదేశం

కడప, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ వీరాభిమాని, కడప సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈయన ఎన్నో ఏళ్లుగా రిమ్స్‌లో పాతుకుపోయి తానే రాజు తానే మంత్రి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈయన సొంతూరు చెన్నూరు మండలం. ఈయన తండ్రి నవనీశ్వర్‌రెడ్డి టీటీడీ బోర్డుమెంబరుగా పనిచేశారు. సర్వజన ఆసుపత్రి ఆవిర్భవించిన తరువాత సురేశ్వర్‌రెడ్డి అక్కడ హవా కొనసాగించారు. వైఎస్ ఉన్నంత వరకు వీళ్ల ఫ్యామిలీ కాంగ్రెస్‌లో ఉండేది. జగన్ పార్టీ ఏర్పాటు తరువాత వైసీపీలో ఉన్నారంటారు. కాంగ్రెస్ అయినా వైసీపీ అయినా రిమ్స్‌లో ఈయనదే డామినేషన్. వివేకా హత్య కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న కొందరు నిందితులు అనారోగ్యం పేరుతో ఈ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. అప్పట్లో ఇక్కడ ట్రీట్‌మెంటుపై పెద్ద విమర్శలు వచ్చాయి. సరిగ్గా ఎన్నికల ముందు సురేశ్వర్‌రెడ్డి మరింతగా బరితెగించారు. టీడీపీ వాళ్లతో మాట్లాడవద్దు, వైసీపీకి ఓటు వేయండి, టీడీపీకి వేయవద్దు అంటూ ఆయన నేరుగా వైద్యశాల సిబ్బందికి ఫోన్లు చేసి బెదిరించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు వికలాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్లను వైసీపీ సిఫారసుల మేరకు అనర్హులకు జారీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈయన వ్యవహారంపై ఆధారాలతో సహా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆగస్టు 1న ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. వైసీపీకి ఓటు వేయాలంటూ ఆయన చేసిన ప్రచారం వాయిస్ రికార్డులతో సహా ప్రభుత్వానికి చేరవేశారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సురేశ్వర్‌రెడ్డిపై విచారణకు ఆదేశించింది.

పాలనకు వందనం



- హామీల అమలు దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు
- పెన్షన్ పెంపు, డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, ఉచిత ఇసుక పాలసీ అమలు
- జిల్లాలో లోకేశ్ పాదయాత్రలో చెప్పిన మేరకు..
- 90 శాతం సబ్సిడీతో డ్రిప్ హామీ అమలు
- చంద్రబాబు వంద రోజుల పాలనకు జనం వందమార్కులు
- అయితే.. జిల్లాలో ఓవరాక్షన్ చేస్తున్న టీడీపీ బ్యాచ్
- ఇసుక దందా, సెటిల్‌మెంట్లు, గ్రావెల్ అడ్డగోలు తవ్వకాల్లో ముందుకు

జనాన్ని విసిగించిన జగన్ సర్కారును జనం ఇంటికి పంపారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి శుక్రవారం నాటికి వంద రోజులు పూర్తి కానుంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలనకు జనం నుంచి వందమార్కులు పడుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కోటి అమలు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే పించన్ల పెంపు, మెగా డీఎస్సీ ప్రకటన చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు. కుక్కలు చింపిన విస్తరిలా మారిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు రేయింబవళ్లు కష్టపడుతుండటంతో అందరిలో సానుకూలత ఉంది. అయితే అదే సమయంలో కొందరు కూటమి నేతల తీరుతో పార్టీకి మరక పడుతోంది. ఐదేళ్ల జగన్ పాలనలో వైసీపీ వారు చెలరేగినట్టు ఇప్పుడు టీడీపీ వారూ ప్రవర్తిస్తుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. వంద రోజులకే ఇలా ఉంటే ఇక నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలు ఏం చేస్తారో అని జనం భయపడుతున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారును సాగనంపేందుకు తండ్రి కొడుకులు అహర్నిశలు కష్టపడ్డారు. అక్రమ కేసులో చంద్రబాబు జైలుకెళ్లారు. యువగళం పాదయాత్ర పేరిట లోకేశ్ రాష్ట్రమంతా చుట్టారు. ఎన్నికల సమయంలో అగ్నికి వాయువు తోడైనట్లు జనసేనాని పవన్ కళ్యాణ్ వీరికి తోడయ్యారు. దీంతో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి జనం జై కొట్టారు. జగన్ సొంత జిల్లాలోనే ఐదుస్థానాలు కూటమికి కట్టబెట్టారు. జనం నమ్మకాన్ని చంద్రబాబు సైతం నిలబెట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైజాగ్, చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తికి మహర్దశ పట్టింది. కారిడార్‌లో కొప్పర్తి పారిశ్రామిక సిటీగా ఎంపికైంది. రూ.2137 కోట్లతో కొప్పర్తిని అభివృద్ధి చేయనున్నారు. 54వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానుండడంతో నిరుద్యోగుల్లో చంద్రబాబు ప్రభుత్వంపై సానుకూలత ఉంది.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు

జగన్ హయాంలో తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అంటేనే రైతులు గుండెలు డబ్ డబ్ అనేవి. అప్పటికే వైసీపీ నేతలు ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు కూడా కబ్జా చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకునేందుకు మార్గం సుగమం చేసుకుంటున్నారని తెలిసి రైతులు ఎగిరిపడ్డారు. అలాంటి వారికి చంద్రబాబు భరోసా ఇచ్చారు. జిల్లాలో కడప, ప్రొద్దుటూరులో జరిగిన ఎన్నికల ప్రచారాల్లో చంద్రబాబు పాల్గొన్నారు. తాము అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు సొంత ఆస్తుల రక్షణకే ప్రమాదంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారు. దీంతో సర్వత్రా చంద్రబాబుపై హర్షం వ్యక్తమైంది.

ఉచిత ఇసుక



ఎన్నికల హామీలో భాగంగా ఉచిత ఇసుక అమలుకు శ్రీకారం చుట్టారు. కేవలం రవాణా చార్జీలు, నిర్వహణ చార్జీలు మాత్రమే తీసుకుని ఇసుక ఇస్తున్నారు. ఇది నిర్మాణదారులకు ఊరట కలిగిస్తోంది. అయితే ఇప్పుడు నదుల్లో నీళ్ల ఉండటంతో అన్ని చోట్ల తవ్వకాలకు అవకాశం లేదు. నదుల్లో నీళ్ల తగ్గిన వెంటనే అన్నిచోట్లా ఇసుక అందుబాటులోకి రానుంది.

90 శాతం సబ్సిడీ

నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా కడపలో మిషన్ రాయలసీమ పేరిట 15వ రోజున సభ నిర్వహించారు. రాయల సీమలో పాదయాత్ర చేస్తున్న సమయంలో తాను గుర్తించిన సమస్యలకు పరిష్కారాలు కనుగొం టూ ఇక్కడే మిషన్ రాయలసీమ పేరిట ఒక డిక్లరేషన్ ప్రకటిం చారు. సీమను ఆటోమొబైల్ హబ్‌గా మారుస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు కడపను స్పోర్ట్స్‌సిటీగా హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇస్తామని చెప్పిన హామీని మాత్రం నిలబెట్టుకున్నారు. ఇక పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

డీఎస్సీపై ఆశలు

చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో ప్రొద్దుటూరు, కడపలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మాట ఇచ్చారు. చెప్పినట్లుగానే డీఎస్సీ కొలువులపై సంతకం చేసి నిరుద్యోగులకు శుభవార్త చెప్పారు.



అన్న క్యాంటీన్లు

రూ.5కు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను జగన్ ప్రభుత్వం క్లోజ్ చేసింది. జిల్లాలో వాటిని మళ్లీ ప్రారంభించనున్నారు. కడపలోని పాతబస్టాండు, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాల్లో ప్రారంభం కానున్నాయి.




వైసీపీ బాటలో టీడీపీ తమ్ముళ్లు..

టీడీపీ అంటే ఒకప్పుడు క్రమశిక్షణకు మారుపేరుగా ఉండేది. ఒకరి ఆస్తులు దౌర్జన్యంగా లాక్కోవడం, కబ్జాలు చేయడం, అక్ర మాలకు పాల్పడే రకం కాదంటారు. ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలోకి వలస వచ్చారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈసారి వలస వచ్చిన నేతలు చంద్రబాబు ప్రభుత్వాన్ని మరక చేస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతుంటే ఈ బ్యాచ్ మాత్రం వైసీపీ బాటలోనే పయనిస్తు ప్రభుత్వా నికి చెడ్డపేరు తెస్తున్నారు. కడపలో ఈ ధోరణి మరీ ఎక్కువగా ఉంది. వీరు గతంలో ఎప్పుడూ లేని సంస్కృతి ని తీసుకువచ్చారు. రెండుబార్లను స్వాధీనం చేసుకున్నారు. ఇక చెరువుల్లో మట్టి తోలుకోవడం, ఇసుక తరలింపు వ్యవహారంలో పెద్ద విమర్శలు వచ్చాయి. వైసీపీలో కీలకంగా ఉంటూ టీడీపీ పొడే గిట్టని బ్యాచ్‌తో కొందరు టీడీపీ నేతలు కలిసి నడుపుతున్న వ్యవహారం పెద్ద దుమారం రేపుతోంది. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారమైనా ఉచిత ఇసుకకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. జిల్లాలో నదుల్లో నీళ్ల ఉండడం, తవ్వకానికి అవకాశాలు లేకపోవడంతో కేవలం రెండు మూడుచోట్ల మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. ఇదే అదనుగా కొండాపురం, వీఎన్‌పల్లెలో కూటమి నేతలు ఇసుక టిప్పర్లకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రొద్దుటూరు, కడప, జమ్మలమ డుగులో కొందరు కూటమి నేతలే ఇసుకను లూటీ చేసి అధిక ధరలకు అమ్ముకుని ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు.

ఆటా పేకాట

జిల్లాలో జూదమంటేనే జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరు కేరాఫ్‌గా ఉంటాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్కడ ఇవి తగ్గలేదు. జమ్మలమడుగులో కీలక నేతల అనుచరులే ఆట ఆడిస్తున్నారని పేరుంది. ఇక పులివెందులలో అయితే ముఖ్యనేత బామ్మర్ది జూదాన్ని ప్రోత్సహిస్తారంటారు. వాళ్ల అనుచరుడే మట్టి ఇతర అక్రమాల్లో పాల్గొన్నానే ఆరోపణలు ఉన్నాయి. ఇక కడప, బద్వేలులో భూకబ్జాలు పెరిగిపోయాయి. మైదుకూరులో రోడ్ల నిర్మాణంలో కొందరు తెలుగుతమ్ముళ్ల పర్సంటేజీలు అడుగుతున్నారని ప్రచారం సాగుతోంది. చంద్రబాబునాయుడు ఎంతో కష్టపడి కూటమిని అధికారంలోకి తీసుకువచ్చారు. ఆయన పాలనపై జనంలోనూ సానుకూలత ఉంది. అదే సమయంలో కొందరు లోకల్ బ్యాచ్ నిర్వాకం వల్ల విమర్శలు రావడం గమనార్హం.


పించన్ల పెంపుతో..



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు వృద్ధుల పించన్లను రూ.4వేలు చేశారు. ఇచ్చిన హామీ మేరకు పాత బకాయిలు కూడా అందించారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు, ఒంటరి మహిళలు, డయాలసిస్ పేషంట్లకు చంద్రబాబు తొలిసంతకం ఓ ఆక్సిజన్ లాంటిది. 1వ తేదీ ఆదివారం అయితే పించన్ పంపిణీ ఒకరోజు ముందే పంపిణీ చేస్తున్నారు. ఉద్యోగులకు సైతం జీతాలు ఎదురుచూసే అవసరం లేకుండా ఠంచనుగా అందుతున్నాయి.



మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో బుధవారం సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన ఎన్డీయే శాసనసభాపక్ష నేతల సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, నంద్యాల వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, సి.ఆదినారాయణరెడ్డి



యువగళం పాదయాత్ర 1400 కి.మీ చేరుకున్న సందర్భంగా పెద్దముడియం మండలం నెమళ్లదిన్నెలో నారా లోకేశ్ ఆవిష్కరించిన మైలురాయి

అమలు కాని నారా లోకేశ్ హామీలు

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ యువగళం పాదయాత్ర జిల్లాలో 18రోజుల పాటు 200 కి.మీ సాగింది. కర్నూలు జిల్లాలో పాదయాత్ర ముగించుకుని నారాలోకేశ్ గత ఏడాది మే 22న పెద్దముడియం మండలంలోని సుద్దపల్లెలో అడుగు పెట్టారు. పాదయాత్రలో భాగంగా పెద్దముడియం మండలంలోని నెమళ్లదిన్నెలోకి చేరుకునేసరికి లోకేశ్ పాదయాత్ర 1400 కి.మీ చేరుకుంది. ఇక్కడ మైలు రాయి వేశారు. ఈ మజిలీ గుర్తుగా జమ్మలమడుగు నియోజకవర్గం, పెద్దముడియం మండలం నెమళ్లదిన్నెలో గండికోట రిజర్వాయరు నిర్వాసితులకు ఉపాధి కల్పించే చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని అప్పట్లో నారాలోకేశ్ హామీ ఇచ్చారు. ఆ హామీ ఇంకా అమల్లోకి రాలేదు. ఇక లోకేశ్ పాదయాత్ర కడప కార్పొరేషన్ పరిధిలోని అలంఖాన్‌పల్లె చేరుకునేసరికి 1500 కి.మీ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కడప పట్టణంలో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తూ లోకేశ్ మైలురాయి ఆవిష్కరించారు. వాస్తవంగా అయితే కడపలో భూగర్భడ్రైనేజీ ఘోరంగా ఉంది. అప్పట్లో కాంగ్రెస్, ఇప్పటి జగన్ అండ్ కో బ్యాచే కడపను మురుగునీటి మయం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి వందరోజులు అవుతున్నా లోకేశ్ ఇచ్చిన ఈ హామీ మాత్రం ఇంకా అమలుకు నోచుకోలేదు.



యువగళం పాదయాత్ర 1500 కి.మీ చేరుకున్న సందర్భంగా కడప నియోజకవర్గం అలంఖాన్‌పల్లె వద్ద శిలాఫలకం ఆవిష్కరించిన నారా లోకేశ్

గంజాయి అమ్మితే
జిల్లా బహిష్కరణే..!

- మట్కా, క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా కూడా..
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఎర్రగుంట్ల, సెప్టెంబరు 18: జిల్లాలో మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ఎర్రచందనం, గంజా యిలాంటి విక్రయించి పట్టుబడినా జిల్లా బహిష్కరణ చేస్తామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. బహిరంగంగా మద్యం సేవించడాన్ని పూర్తిగా అరికడతామని ఆయన తెలిపారు. బుధవారం ఎర్రగుంట్ల అర్బన్ పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ లాకప్‌ను, పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఏయే పోలీసు ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడే వారిపై ముఖ్యంగా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో బైండోవర్ కేసులు పెడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 700 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల తర్వాత రెండు నెలల్లో ఈ కేసులు పెట్టామన్నారు. బైండోవర్ కేసులు, మరిన్ని నేరాలతో సంబంధాలున్న వారిపై పీడీ యాక్టు పెట్టి జిల్లా బహిష్కరణ చేసేందుకు కలెక్టర్‌తో మాట్లాడుతున్నట్లు తెలిపారు. గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు సుమారు 50మందిని జైలుకు పంపామన్నారు. జిల్లాలో గంజాయిని పండించే వారు లేరని అయితే ఏజెన్సీ నుంచి మూడునాలుగు కేజీలు తెచ్చి పొట్లాలు కట్టి అమ్ముతున్న బ్యాచ్‌లు ఉన్నాయన్నారు. బహిరంగంగా మద్య పానం చేయడం నివారించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇలాంటి 274 ప్రదేశాలు గుర్తించి వాటిలో 220 ప్రదేశాలను శుభ్రం చేయించామన్నారు. తాగుతూ మాటామాటా పెరిగి దాడులు చేసుకోవడం, చంపేయడం జరుగుతున్నాయని ఇలాంటి వాటిపై గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకే బహిరంగ ప్రదేశాలల్లో మద్యం సేవించడాన్ని పూర్తిగా అరికట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేశ్‌బాబు, ఎస్ఐ విష్ణునారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి



జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న విజయజ్యోతి

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 18: జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో పీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆమె చేత జిల్లా అధ్యక్షురాలిగా ప్రమాణం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద బడుగు, బలహీన వర్గాలతో పాటు ఎస్సీఎస్టీ మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జిల్లాలో కాంగ్రెస్ ఒక వెలుగు వెలిగిందన్నారు. అందర్నీ కలుపుకుని తన శక్తి వంచన లేకుండా పార్టీ పటిష్టత కోసం పాటుపడతామన్నారు. తులసిరెడ్డి మాట్లాడుతూ ఏడాదిలోగా స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిర్ణయాత్మక పాత్ర పోషించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వంద రోజుల చంద్రబాబు పాలనలో సామాజిక పెన్షన్ తప్ప మిగిలిన పథకాలేవీ అమలు కాలేదన్నారు. అంతకు ముందు విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి కాంగ్రెస్ కార్యాలయం వరకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు జి.శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్, నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, రాష్ట్ర కార్యదర్శులు అలీఖాన్, ఎస్ఏ సత్తార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్, అల్లా బకష్, బండి జకరయ్య పాల్గొన్నారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో వైవీయూ ప్రొఫెసర్లు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: ముగ్గురు వైవీయూ ప్రొఫెసర్లు అంతర్జాతీయ కీర్తిని ఆర్జించారు. ప్రపంచ పరిశోధకుల జాబితా మొదటి రెండు శాతంలో వీరు నిలిచారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఎల్‌సేవియర్ సహకారంతో రూపొందించిన ప్రముఖ సైంటిస్ట్‌ల జాబితా-2024లో వీరు నిలిచి వైవీయూ ఖ్యాతిని పెంచారు. వైవీయూ మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ శంకర్ వరుసగా నాలుగేళ్లు ఈ గుర్తింపు అందుకోవం విశేషం. ఇక మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వీరాంజనేయరెడ్డి బయో టెక్నాలజీ ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో రాసిన పరిశోధన పత్రాలు అత్యంత నాణ్యమైనవిగా గుర్తించి వీరిని ఈ ఏడాది మొదటి 2 శాతం పరిశోధకుల జాబితాలో చేర్చారు. అలాగే రసాయన శాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు ఆర్గానిక్ కెమిస్ట్రీలో రాసిన పరిశోధన పత్రాల సైటేషన్స్ హెచ్ ఇండెక్స్‌ను ప్రామాణికంగా తీసుకుని మొదటిసారిగా మొదటి రెండుశాతం పరిశోధకుల జాబితాలో నిలిపారు. ఇంతటి అద్భుత విజయం సాధించిన ప్రొఫెసర్లను వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి, ఉప ప్రధాన ఆచార్యులు పద్మ, పలువురు అధ్యాపకులు అభినందించారు.

నేడు కడప, ప్రొద్దుటూరులో అన్నక్యాంటీన్లు ప్రారంభం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: కడప, ప్రొద్దుటూరులో గురువారం నుంచి అన్నక్యాంటీన్లు ప్రారంభం కానున్నట్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే హామీలన్నీ ఒక్కొక్కటి నెరవేరుస్తోందని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం గాయత్రీ టవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వంద అన్నక్యాంటీన్లను ప్రారంభించామన్నారు. కడప, ప్రొద్దుటూరుతో కలిపి రేపు రాష్ట్రవ్యాప్తంగా మరో 75 అన్నక్యాంటీన్లను ప్రారంభించబోతున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి నీళ్లు వాడుకోవడానికి వెసులుబాటు కలుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇసుక అందని పరిస్థితి ఉండేదన్నారు. పారదర్శకంగా ప్రతి ఒక్కరికీ ఇసుక అందే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం




సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అట్లూరు, సెప్టెంబరు 18: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అధికారులు పర్యవేక్షించి సంపద సృష్టించాలని కలెక్టరు లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం అట్లూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి చెత్త నుంచి సంపద ఎలా చేయాలన్న దానిపై సలహాలు సూచనలు ఇచ్చారు. మూడు నెలలకు మళ్లీ వస్తానని, ఇక్కడ సంపద కనిపించాలని ఆదేశించారు. సంపద కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి రెండు సంవత్సరాలుగా జీతభత్యాలు అందడం లేదని కలెక్టరు దృష్టికి తెచ్చారు. అనంతరం అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో విధులు నిర్వహించే ఇద్దరు వైద్యులూ లేకపోవడంతో డీఎంహెచ్‌వోకు ఫోను చేసి మాట్లాడారు. వైద్యులు సమ్మెల్లో ఉన్నారని డీఎంహెచ్‌వో తెలిపారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించడంలేదని, సిబ్బంది 11గంటలకు వచ్చి 2గంటలకు వెళ్లిపోతున్నారని స్థానికులు కలెక్టరుకు తెలిపారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో తనిఖీ చేశారు. ఆరునెలలుగా రెగ్యులర్ తహశీల్దారు లేరని, భూసమస్యలు పెరిగిపోతున్నాయని, భూముల మ్యుటేషన్లు చేయడంలేదని రైతులు కలెక్టరు దృష్టికి తెచ్చారు. జేసీతో చర్చించి తహశీల్దారును నియమిస్తామని అన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని, అట్లూరు పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. ఎస్ఐ రామక్రిష్ణను మండలంలోని శాంతిభద్రతల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాతమ్మ, పంచాయతీ అధికారి శివప్రసాద్, ఏపీయం సురేశ్‌బాబు, ఏవో బాబురావు, ఎంఈవో విలియంరాజు, ఆర్ఐ కరీముల్లా, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మగుడి పేరుతో ఆక్రమణలు

- షెడ్లు వేసి అద్దెలు వసూళ్లు చేస్తున్న వైనం
- ఆక్రమణలు తొగించాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నోటీసులు



ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ ఇచ్చిన నోటీసు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 18: ప్రొద్దుటూరు మున్సిపాలిటీ స్థలాలు ఒక్కొక్కటిగా అన్యాక్రాంతం అవుతున్నాయి. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొన్నేళ్లుగా కళ్లు మూసుకున్నట్టుగా వ్యవహరించడంతో అక్రమ కట్టడాలతో పాటు మున్సిపల్ స్థలాల ఆక్రమణలు పెరిగిపోయాయి. ప్రొద్దుటూరు మున్సిపల్ ఇండోర్ స్టేడియానికి సంబంధించిన కొంత స్థలంలో కొన్నేళ్ల క్రితం కొందరు కుల సంఘాలను అడ్డుపెట్టుకుని ముందుచూపుతో పెద్దమ్మ విగ్రహం పెట్టి ఆక్రమించారు. మరి కొంతకాలానికి గుడి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గదుల నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నించారు. అప్పట్లోనే మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గదుల నిర్మాణాన్ని అడ్డుకున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో తాత్కాలిక కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేశారు. కుల సంఘం నేతగా ఉన్న నాయకుడు తాను ఆక్రమించిన స్థలాన్ని నిలుపుకోవడానికి వైసీపీలో చేరాడు. వెంటనే ఆగిపోయిన గదుల నిర్మాణం పూర్తి చేశాడు. అక్కడ పూలమండీకి, టెంకాయల అంగళ్లకు, పాల వ్యాపారాలకు ఇచ్చి అద్దెలు వసూలు చేయడం మొదలెట్టాడు. మూడేళ్లుగా ఈ వ్యవహారం సాగుతోంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలు

వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అక్రమ కట్టడాలపై, మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ స్థలం ఆక్రమించి నిర్మించిన షెడ్లను తొలగించాలని అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చినా ఆక్రమణదారులు వాటిని లెక్కచేయలేదు. అంతేకాకుండా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడని చెప్పి లోక్‌సత్తా నాయకుడు తెల్లాకుల మనోహర్ ఇంటిపైకి వెళ్లి ఆక్రమణ దారుడు బెదిరించాడు. దీనిపై బాధితుడు మనోహర్ ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. పెద్దమ్మ గుడికి పక్కన మున్సిపల్ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్లు తొలగించాలని మున్సిపల్ అధికారులు నోటీసులు అంటించారు. అయితే మున్సిపల్ అధికారులు గుడి తొలగిస్తున్నారంటూ అక్కడే మూడు రోజులుగా కొందరు బైఠాయించి నిరసన చేపడుతున్నారు.

త్వరలో ఆక్రమణలు తొలగిస్తాం..

మున్సిపల్ హైస్కూలుకు సంబంధించిన స్థలం ఆక్రమించి గుడి నిర్మించారు. పక్కన షెడ్లు వేసుకుని అక్రమంగా అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. ఆక్రమణలు తొలగించుకోవాలని నోటీసులు ఇచ్చాం. కానీ వారు స్పందించలేదు. ఫైనల్‌గా వాటిని తొలగించేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలిచ్చాం. ఆక్రమణదారులు కోర్టుకు వెళ్లారు. వారికి రెండువారాల గడువు ఇచ్చారు. త్వరలో పోలీసు ప్రొటెక్షన్ తీసుకుని గుడిపక్కన వేసిన షెడ్లు తొలగిస్తాం.

- రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



తీవ్రంగా గాయపడిన వెంకట్రమణ వద్ద విలపిస్తున్న ఆయన భార్య

రామాపురం, సెప్టెంబరు 18: మండలంలోని చిట్లూరు సమీపంలో బుధవారం తెల్లవారు జామున జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పురం వెంకట్రమణ (60) మృతి చెందగా.. మరో వ్యక్తి లక్ష్మీనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... నల్లగుట్టపల్లి పంచాయతీ కొత్తపల్లెకు చెందిన వెంక ట్రమణ, ఆయన బామ్మార్ది లక్ష్మీనారాయణ బుధవారం ఉదయం గాలివీడు నుంచి మోటారు బైక్‌లో వస్తుండగా చిట్లూరు సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో వెంకట్రమణ కుడికాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకట్రమణ మృతి చెందాడు. లక్ష్మీనారాయణ చికిత్స పొందుతున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



కుళ్లాయప్ప మృతదేహం

సింహాద్రిపురం, సెప్టెంబరు 18: మండలంలోని పైడిపాళెం గ్రామానికి చెందిన మిడుతూరి కుళ్లాయప్ప(38) పురుగుల మందు తాగి మృతి చెందాడు. సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ వివరాల మేరకు... కుళ్లాయప్ప మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని ఆరోగ్యం క్షీణించడంతో కలత చెందిన కుళ్లాయప్ప మంగళవారం సాయంత్రం పురుగులమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతని తండ్రి ఖాశీం గమనించి చికిత్స నిమిత్తం పులివెందుల ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుళ్లాయప్పకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ - ఒకరు మృతి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 18: రాజంపేట పట్టణానికి సమీపంలో కడప - చెన్నై ప్రధాన రహదారిలో బైకును లారీ ఢీకొనడంతో కళ్యాణ్‌కుమార్(23) మృతి చెందాడు. అనంతపురం జిల్లా వెలిగొండ గ్రామానికి చెందిన కళ్యాణ్ కుమార్ రాజంపేట సిందూర హోటల్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం జాతీయ రహదారిపైకి రాగా.. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. మన్నూరు పోలీసులు లార్రీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో కువైత్‌లో వ్యక్తి మృతి



సుండుపల్లి, సెప్టెంబరు 18: సుండుపల్లి మండలం ఏటిగడ్డ రాచపల్లికి చెందిన చమర్తి నాగరాజు (45) గుండెపోటుతో కువైత్‌లో మృతి చెందినట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. బతుకుదెరువు కోసం భార్య, భర్తలు కువైత్ వెళ్లారు. మంగళవారం నాగరాజుకు గుండెపోటు రావడంతో మృతి చెందాడు. కాగా, నాలుగు సంవత్సరాల క్రితం వీళ్లు సుండుపల్లి నుంచి రాజంపేటకు వెళ్లి జీవనం సాగించేవారు. వీరికి ఒక కూమారుడు, ఒక కూతురు ఉన్నారు. నాగరాజు మృతితో వారి సొంత ఊరిలో విషాధచాయలు అలుముకున్నాయి. శుక్రవారం ఆయన మృతదేహం కువైట్ నుంచి రావచ్చని బంధువులు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

సుండుపల్లి, సెప్టెంబరు 18: మండలంలోని జెసి కురవపల్లికి చెందిన హనుమంతు కుటుంబ సభ్యులపై దాడి కేసులో పి.బాబుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇంటి స్థలం విషయంలో ఫిర్యాదు చేస్తున్నారని దాడి చేసినట్లు హనుమంతు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు



కమలాపురం రూరల్, సెప్టెంబరు 18: నాయీ బ్రాహ్మణవీధిలో జరిగిన కుక్కల దాడిలో తరుణ్ అనే బాలుడు గాయపడ్డాడు. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడిపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో పొట్ట, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. కమలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించనున్నట్లు వైద్యులుతెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం : కుక్కల దాడిలో బాలుడు గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి బాలుడికి అవసరమైతే మెరుగైన చికిత్స అందించాలని ఫోన్ ద్వారా తెలిపారు.

రూ.9లక్షలతో వైకుంఠ రథం వితరణ



రాగిమాను ప్రతాప్‌కుమార్‌ను సత్కరిస్తున్న బలిజసేవా సంఘం నాయకులు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 18: కులమతాలకు అతీతంగా నిరుపేదలు వైకుంఠ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏసియన్ డిజిటల్ కేబుల్ అధినేత, టీడీపీ నేత రాగిమాను ప్రతాప్‌కుమార్ అన్నారు. బుధవారం బలిజసేవా సంఘానికి సుమారు రూ.9లక్షలు విలువచేసే వైకుంఠ రథాన్ని వితరణ చేశారు. తన తండ్రి రాగిమాను రంగయ్య, మేనమామ దేవిరెడ్డి తిరుపాలయ్య జ్ఞాపకార్థం వైకుంఠరథాన్ని, బాడీఫ్రీజర్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. నిరుపేదలు ఎవరైనా సరే కులమతాలకు అతీతంగా వైకుంఠ రథం కావాల్సిన వారు బలిజసేవా సంఘంను సంప్రదిస్తే ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం బలిజ సేవాసంఘం నాయకులు రాగిమాను ప్రతాప్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. బలిజసేవాసంఘం అధ్యక్షుడు దద్దం వెంకటేశ్వర్లు, కొర్రపాటి సురేంద్ర, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, చిన్నసుబ్బారావు, కొంకుల రాంబాబు, ఆవుల శ్రీనివాసులు, బుజ్జి, నానబాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వాన జాడ లేక...

- ఎండుతున్న పంటలు
- కాపాడుకునేందుకు రైతన్నల తాపత్రయం
- బోరుబావుల తవ్వకాలు.. లక్షల్లో ఖర్చు
- రైతులకు తప్పని కష్టాలు

సంబేపల్లె, సెప్టెంబరు 18: వేసవిని తలపించేలా భగభగ మండుతున్న ఎండలు... అప్పడప్పుడు మేఘాలు కమ్ముకుంటున్నా వర్షం జాడ లేక.. రోజురోజుకు భూగర్భజలాలు పాతాళానికి పడిపోయాయి. దీంతో సాగు చేసిన పంటలన్నీ కళ్లముందు ఎండిపోవటంతో రైతన్నలు తల్లడిల్లిపోతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటి తడులు అందిస్తుంటే.. మరి కొందరు అప్పులు చేసి బోరు బావులను తవ్విస్తున్నారు. ఇదే అదునుగా బోరు బావుల తవ్వకానికి ధరలు భారీగా పెంచేశారు. గతంలో బోరుబావి తవ్వకాలకు 300 అడుగుల వరకు 80 నుంచి 85 రూపాయలు ఉండేది. ప్రస్తుతం 100 రూపాయలకు పెంచారు. దీంతో రైతులు బోరు బావి తవ్వాలంటే లక్షరూపాయలుపైనే ఖర్చు చేయాల్సి వస్తోంది. గత రెండు నెలల నుంచి వర్షం జాడ లేకపోవడంతో వరినార్లు పోసిన కొందరు రైతులు వదిలేశారు. వేరుశనగ పంట ఎండిపోతుంది. మామిడి చెట్లు నిలువునా మాడిపోతున్నాయి. పల్లె జనాలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే పరిస్థితి. సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయి కరువు నెలకొంది. కరువు పరిస్థితులు నుంచి తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



వదిలేసిన వరినారులో పశువులు మేస్తున్న దృశ్యం



దుద్యాల పెద్దజంగంపల్లి వద్ద ఎండిపోయిన వేరుశనగ పంట



టమోటా పంటకు ట్యాంకర్ ద్వారా నీటి తడి అందిస్తున్నరైతు



కేతంరెడ్డిగారిపల్లె వద్ద ఎండిన మామిడి తోట

ట్యాంకర్ ద్వారా తడులు అందిస్తున్నా



బోరుబావిని నమ్ముకుని రెండు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశా. పూత, పిందె దశలో ఉంది. వర్షాభావ పరిస్థితులతో బోరులో నీరు రాలేదు. పంట ఎండిపోతోంది. దీంతో ట్యాంకర్ నీరు 800 రూపాయలు పెట్టి నీటి తడులు అందిస్తున్నాం. రోజుకు నాలుగు ట్యాంకర్ల నీరు కావాలి. ఇప్పటికే పంట సాగుకు 3 లక్షలు ఖర్చుపెట్టా. బోరు వేసినా ప్రస్తుతం నీళ్ల పడతాయన్న నమ్మకం లేదు. పంటను కాపాడుకోవడం గగనంగా మారింది.

-చలపతి, టమోటా రైతు, రాయచోటి

వరినారు వదిలేశాం

వర్షంపై ఆధారపడి బోరుబావి కింద వరి సాగు చేద్దామని మూడు బస్తాలు విత్తనాలు తెచ్చి నారు పోస్తే బోరుబావిలో నీరు రాలేదు. దీంతో నారు మడి వదిలేసి.. పాడి పశువులు మేపుతున్నా. వర్షాకాలం లోనే ఇలా ఉంటే వేసవి కాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో.. సంబేపల్లె మండలం నగిరికి చెందిన మరో రైతు వరి సాగు చేసి నీరు రాక పంట వదిలేశారు.

- జనార్థన్‌నాయుడు, రైతు, బొగ్గులవారిపల్లె

బోరు బావి తవ్వించాం...



పొలం గుత్తకు తీసుకుని టమోటా పంట సాగు చేశా. ప్రస్తుతం బోరు బావిలో నీరు రాలేదు. పంట దెబ్బ తినకుండా బోరుబావి తవ్వించాం. నీరు పండింది. 600 అడుగుల లోతులో మోటారు బిగిస్తే వాటర్ గ్యాప్ వస్తోంది. 700 అడుగులపైన నీళ్లు పడ్డాయి. టమోటా పంట ఎండిపోకుండా కాపాడుకునేందుకు తాపత్రయం పడుతున్నా.

-అంజి, రైతు, రాజువారిపల్లె, సంబేపల్లె మండలం



బోరు తవ్విస్తున్న రైతు

విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు


- కస్తూర్భా వసతిగృహం తనిఖీలో కలెక్టర్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

వీరబల్లి, సెప్టెంబరు 18: విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కేజీబీవీ జూనియర్ కళాశాలను, వసతి గృహాన్ని పటిష్టంగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం వీరబల్లి మండలంలోని కేజీబీవీ జూనియర్ కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం కెపాసిటీ ఎంత, ప్రస్తుతం ఉన్న విద్యార్థినుల సంఖ్య ఎంత, రోజువారీ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, వసతి గృహ నిర్వహణ, విద్యార్థినులకు పాఠాల బోధన, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాల్లో కేజీబీవీ నిర్వాహకులకు, విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులందరూ బాగా చదువుకొని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కష్టపడిన వారికి కచ్చితమైన ఫలితం లభిస్తుందని, కేవల చదువుకున్నామని కాకుం డా సృజనాత్మకత జోడించి విద్యా ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకోవాలని తెలిపారు. అనుమతి లేకుండా ఇతరులను, బయటి వారిని ఎవరినీ వసతి గృహంలోకి అనుమతించరాదని, విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థినులతో మమేకమై వారితో పాటు కూర్చుని భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, కేజీబీవీ జూనియర్ కళాశాల వసతి గృహ నిర్వాహకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎల్ఎల్‌బీ సెమిస్టరు పరీక్షలు



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: జిల్లాలో ఎల్ఎల్‌బీ సెమిస్టరు పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను వైవీయూ రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. ఈపరీక్షలకు తొలిరోజు 511 మంది హాజర య్యారు. 33 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల విభాగం ముఖ్య పర్యవేక్షకులు ప్రొఫెసరు పద్మ తెలిపారు. పరీక్షల నిర్వహణలో సహాయ పర్యవేక్షకులుగా డాక్టర్ లక్ష్మీప్రసాద్, మునికుమారి, సిబ్బంది చంద్రమౌళి పాల్గొన్నారు.

రాయచోటి డీఎస్పీగా కృష్ణమోహన్

రాయచోటి టౌన్, సెప్టెంబర్ 18: రాయచోటి డీఎస్పీగా కృష్ణమోహన్‌ను నియమిస్తూ డీజీపి ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు, విశాఖపట్నం, ఏలూరు, కర్నూలు రేంజ్‌ల పరిధిలో సీఐలుగా పని చేస్తున్న 14 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించడంతో పాటు పోస్టింగులు ఇచ్చారు. ఇందులో భాగంగానే కర్నూలులో సీఐలుగా పనిచేస్తున్న కృష్ణమోహన్‌కు రాయచోటి డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రామచంద్రరావును బదిలీ చేశారు.

జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శివరామ్ బదిలీ

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 18: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ డిప్యూటీ జనరల్ ఇన్‌స్పెక్టర్ శివరామ్ కాకినాడకు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శివరామ్ మూడేళ్లుగా కడప, అన్నమయ్య జిల్లాల రిజిస్ట్రేషన్ శాఖల డీఐజీగా విధులు నిర్వహించడం గమనార్హం.

అగ్నివీర్ ర్యాలీని విజయవంతం చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కల్నన్ పునీత్‌కుమార్, పక్కన కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలో నవంబరు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని విజయవంతం చేయాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణ ఏర్పాట్లపై రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నన్ పునీత్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ అదితి సింగ్, రిక్రూట్‌మెంట్ మెడికల్ ఆఫీసరు మేజర్ అమర్ దీప్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలసి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఆర్మీలో జాయిన్ అయ్యే వారి కోసం ఇప్పటికే రాతలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వ హించేందుకు జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వేది కగా మారనుందన్నారు. ఈ ఫిజికల్ టెస్టుకు రాష్ట్రంలోని కర్నూలు, నెల్లూరు, అనంతపురం, కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరుకానున్నారు. వారందరికీ మౌలిక సదు పాయాలను కల్పించడంలో కడప నగర పాలకసంస్థ ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో మైదానంలో రిక్రూట్‌మెంట్ బోర్డు విధివిధానాలకు అనుగుణంగా టెంట్లు, బారికేడ్లు, విద్యుత్, తాగు నీరు, టాయిలెట్స్ తదితర మౌలిక ఏర్పాట్లను సమకూర్చాలన్నారు. శాంతిభద్రతలు, పారిశుధ్యం తదితర అంశాలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. అక్టోబరు 15వ తేదీ లోపు మౌలిక ఏర్పాట్లను సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నందన్, జిల్లా ఫైర్ ఆఫీసరు ధర్మారావు, డీటీసీ మీర్‌ప్రసాద్, డీఎంఅడ్‌హెచ్ఓ డాక్టర్ నాగ రాజు, ఆర్అండ్‌బీ డీఈ మాధవి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు స్వస్తి పలకాలి

ఎన్ఎఫ్‌పీఈ ఏఐజీడీఎస్‌యూ నేతలు

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 18: ఆచరణ సాధ్యం కాని టార్గెట్స్ ఆన్‌లైన్ ట్రైనింగ్ కోర్సుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా తపాలా కార్యాలయంలో పనిచేసే కింది స్థాయి సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసే పద్ధతులకు అధికారులు స్వస్తి పలకాలని తపాలాశాఖ ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి టార్గెట్స్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ సర్కిళ్లలో సేవలందిస్తున్న సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్న తీరు సరికాదన్నారు. బుధవారం ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన డివిజనల్ యూనియన్ నేతలు సుబ్బారెడ్డి, సలాం, రాము, సర్కిల్ నేతలు భానుకృష్ణ, గోవిందు మాట్లాడుతూ ఉన్నతస్థాయి ఉద్యోగుల వేధింపుల కారణంగా చాలామంది అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. కొందరు డివిజన్, సబ్ డివిజన్ల అధికారులు పరుష పదజాలంతో వాఖ్యలు చేస్తున్న తీరు బాధాకరమన్నారు. పైపెచ్చు సెలవులు మంజూరు చేయకుండా దూర ప్రాంతాలకు బదిలీ చేస్తామని, ఏపీఏఆర్‌లో గ్రేడింగ్ తగ్గిస్తామంటూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మారుమూల గ్రామాల్లో సరైన నెట్‌వర్క్ సదుపాయం లేకున్నా సిబ్బంది మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌తో విధులు నిర్వర్తించాలని హుకుం జారీ చేయడం దారుణమన్నారు. తక్షణమే జులుం చేసే పద్ధతులకు అధికారులు స్వస్తిపలకాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మునాఫ్, రవికాంత్, వెంకట్, రాంబాబు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలు పుట్టలేదని.. ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ములకలచెరువు, సెప్టెంబరు 18: పిల్లలు పుట్టలేదని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన బుధవారం ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువులోని రాజీవ్‌కాలనీకి చెందిన కె.మహమ్మద్(35)కు బత్తలాపురంకు చెందిన హమీదాతో 13 ఏళ్ల కిందట వివాహ మైంది. పిల్లలు పుట్టకపోవడంతో ఇద్దరూ తరచూ బాధపడేవారు. ఈక్రమంలో హమీదా రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహమ్మద్ ఇంట్లో కిటికీకి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని ఎస్ఐ గాయత్రి పరిశీలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



నిందితున్ని అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 18: ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిని మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పోలీసుల కథనం మేరకు పీటీఎం మండలం, పూలగంటివారిపల్లెకు చెందిన కిరణ్‌కుమార్(33) మదనపల్లెలో నిరుద్యోగుల వద్ద రూ.7.5 లక్షలు వసూళ్లు చేశాడు. తరువాత ఉద్యోగాలు ఇప్పించకుండా ముఖం చాటేశాడు. మోసపోయామని గుర్తించి నిరుద్యోగులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితున్ని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2.20 లక్షలు రికవరీ చేశారు. కేసు నమోదు చేసి కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇరువురికి గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 17: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇరువురు వ్యక్తులు తీవ్రగాయాలపాలైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకొంది. నిమ్మనపల్లి పంచాయతీ దిగువవీధికి చెందిన మల్లప్ప, వెంకోజిగారిపల్లెకు చెందిన మహిళ కలిసి బాలినాయుని పల్లిలో మేస్త్రీ పనులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో మల్లప్ప, మహిళకు తీవ్ర గాయాలు కాగా, మరో వాహనంలో ఉన్న వెంకటరమణకు స్వల్పగాయాలయ్యాయి.

స్వచ్ఛకడప సాధనే లక్ష్యం

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం : మున్సిపల్ కమిషనరు వైవోనందన్

చెన్నూరు వంతెనపై మారథాన్ ● వేంపల్లెలో విద్యార్థుల సైకిల్‌ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనరు వైవో నందన్ - చెన్నూరు - కొండపేట వంతెనపై చేస్తున్న రన్నింగ్ - వేంపల్లెలో సైకిల్‌ర్యాలీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ స్వచ్ఛ కడప సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని మున్సిపల్ కమిషనరు వైవో నందన్ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ 2024లో భాగంగా మహవీర్‌సర్కిల్ నుంచి ఆర్ట్స్‌కళాశాల మైదానం వరకు మారథాన్ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ప్రారంభించిన కమిషనరు మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి సూచనల మేరకు స్వచ్ఛతా హి సేవ 2024 కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభిస్తూ మన జిల్లాలో కూడా 15 రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రణాళిక ప్రకారం రోజూ ఒక్కో కార్యక్రమం రూపొందించి అమలు చేసి చివరి రోజు అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా వారికి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేస్తామన్నారు. శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనరు రాకేశ్, చెన్నకేశవరెడ్డి, ఈఈలు, ధనలక్ష్మి, నారాయణ స్వామి, మెప్మా సీఎంఎం హరిప్రసాద్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా కళాశాలలో...

కోటిరెడ్డి మహిళా డిగ్రీకళాశాలలో స్వచ్ఛతా హి సేవ ప్రచారాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో స్వచ్ఛభారత్‌లో భాగంగా పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు డాక్టర్ విజయలక్ష్మీదేవి, డాక్టర్ శచీదేవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం

చెన్నూరు, సెప్టెంబరు 18: శుభ్రతతోనే ఆరోగ్యమని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం పరిశుభ్రత చేపట్టాలని డీఎల్‌పీఓ మస్తాన్‌వల్లి అన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా రెండోరోజు మండల వ్యాప్తంగా పెద్దలు, యువత, విద్యార్థులు రన్నింగ్ చేశారు. చెన్నూరు, కొండపేట హైవేవంతెనపై డీఎల్‌పీఓ, ఎంపీడీఓ ఆధ్వర్యంలో రన్నింగ్ చేశారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. పారిశుధ్య సిబ్బంది లేకపోతే ప్రస్తుత పరిస్థితుల్లో పంచాయతీలు దుర్గంధ భరితంగా మారతాయని చెన్నూరు పంచాయతీలో నిత్యం ప్రజల సేవ కోసం పారిశుధ్యం కోసం పాటు పడడం హర్షణీయమన్నారు. వారి సేవలు మరువలేనివన్నారు. గ్రామ పంచాయతీ అంతా బ్లీచింగ్ చల్లించారు. నిల్వ ఉన్న పలురకాల కసువు కుప్పలు తొలగించారు. చెన్నూరు పంచాయతీలో రాజకీయ నేతలతో కలిసి పరిశుభ్రతపై వీధివీధినా తిరుగుతూ అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సుదర్శన శర్మ, ఈఓఆర్‌డీ సురేశ్‌బాబు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, టీడీపీ వైసీపీ కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, జీఎన్ భాస్కర్ రెడ్డి, అల్లాడు రాజశేఖర్‌రెడ్డి, వేల్పుల సుబ్రమణ్యం, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, మన్నూరు అక్బర్, మణికంత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ నుంచి ర్యాలీ

వేంపల్లె, సెప్టెంబరు 18: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ దివిజ, ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వేంపల్లె జడ్పీ హైస్కూల్ నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు విద్యార్థులతో కలిసి సచివాలయ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ కొనసాగించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో స్వచ్ఛతా హి సేవ నిర్వహించారు. క్యాంపస్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. డైరెక్టర్ గుప్త, ఏఓ ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పాల్గొన్నారు.

పొలతలలో స్వచ్ఛతా హి సేవ

పెండ్లిమర్రి, సెప్టెంబరు 18: మండలంలో ప్రసిద్ధ క్షేత్రమైన పొలతల క్షేత్రంలో స్వచ్ఛతా హి సేవ నిర్వహించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ పరిసరాలను, గోశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొని శుభ్రం చేశారు.

డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య



పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 10: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కడప ఎమ్మెల్యే మాధజట అన్నారు. గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య ముద్రించిన 'ఓ యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదాం' పోస్టరును ఎమ్మెల్యే మాధవి తన నివాసం వద్ద బుధవారం ఆవిష్కరించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంలో యువత భాగస్వామ్యం కావాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య యువతను చైతన్యం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ఎమ్మెల్యే మాధవి, అపుస్మా జిల్లా అధ్యక్షుడు బాలవికాస్ గంగయ్య, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్, అపుస్మా నేతలు అక్షరబాబు, సిద్దవటం వెంకటసుబ్బయ్య టీడీపీ నేతలు బుర్రి రెడ్డయ్య యాదవ్, తెల్లదార్ల విజయకుమార్ యాదవ్, జీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా నేత సాయి తదితరులు 'ఓ యువత డ్రగ్స్‌రహిత సమాజం కోసం పాటుపడదాం' కరపత్రాన్ని కూడా ఆవిష్కరించారు. డ్రగ్స్‌రహిత సమాజం కోసం పాటుపడాలనే నినాదంతో యువతను చైతన్యం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. గంజాయి అరికట్టడంలో ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప క్రైం సెప్టెంబరు 18: మాదక ద్రవ్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని అమృత మైండ్ కేర్ డాక్టర్ హరిత అన్నారు. జిల్లాలోని స్వచ్ఛంద సేవ సంస్థలైన సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ యూత్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీహరి డీగ్రి కాలేజీలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సేవ సంస్థ ప్రతినిధి ప్రసన్న కుమార్ వైస్ ప్రిన్స్‌పాల్ చెన్నకేశవ రెడ్డి, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొలుములపల్లె జడ్పీహైస్కూల్‌లో....

సికెదిన్నె, సెప్టెంబరు 18: మాదకద్రవ్యాల వాడకం అత్యంత ప్రమాదకరమని చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. కొలుములపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, వాడకం అత్యంత ప్రమాదకరమని అంశంపై విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానానికి దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచే యువత మాదకద్రవ్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఉపాధ్యాయులు పాలగంగిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏడీఏ

కమలాపురం రూరల్, సెప్టెంబరు 18: వ్యవసాయ సహాయకుల పంట కోత ప్రయోగాలపై స్థానిక కార్యాలయంలో ఏడీఏ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. పంట కోత ప్రయోగాల ఆవశ్యకత, లాభాల గురించి తెలిపారు. 2024 ఖరీఫ్‌లో మండలంలో వరి పంటకు ఉచిత పంటల బీమా కోసం 28 పంట కోత ప్రయోగాలు, విలేజ్ ఇన్సూరెన్స్ యూనిట్ కింద వరిపంటను, కంది, జొన్న, మినుము పంటలను జిల్లా యూనిట్ కింద ఇచ్చామన్నారు. పత్తి, కంది, చీనీ నిమ్మ, వేరుశనగ పంటలను వాతావరణ ఆధారిత పంటల బీమా కింద చేర్చామన్నారు. పంట కోత ప్రయోగాలను ఆన్‌లైన్ చేసే విధానాన్ని ఏపీ సీసీఈయాప్‌లో ఏ విధంగా చేయాలో ఫారం 1, ఫారం 2లను యాప్‌లో చేసే విధానాన్ని వివరించారు. ఈకేవైసీలను వంద శాతం పూర్తిచేయా లని వ్యవసాయ సహాయకులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి సరస్వతి, వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

200 ప్యాకెట్‌ల పొద్దుతిరుగుడు మినీకిట్లు మంజూరు

వేముల, సెప్టెంబరు 18: మండలానికి 200 ప్యాకెట్‌ల పొద్దుతిరుగుడు మినీకిట్లు మంజూరయ్యాయని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. వేముల రైతుసేవా కేంద్రంలో ఏఓ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహించారు. పత్తి, వేరుశనగ, వరి, పొద్దుతిరుగుడు పంటలపై పంటకోత ప్రయోగంపై ఏఎస్‌ఓ మల్లికార్జున్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. మండలంలో 80శాతం సబ్సిడీతో కందులు, మినుములు, అలసంద విత్తనాలను అవసరం ఉన్న రైతులు రైతు సేవాకేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నమోదు ఈకేవైసీకి 23వరకు గడువు పొడిగించామన్నారు. మిగిలిన రైతులు త్వరగా పూర్తిచేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

వేంపల్లె, సెప్టెంబరు 18: ఎద్దులకొండపై వెలసిన వృషభాచలేశ్వరస్వామి ఆలయ అనుబంధ వేంకటేశ్వరస్వామి, అంజనేయస్వామి ఆలయాల్లో హుండీలను లెక్కించారు. వేంకటే శ్వరస్వామి హుండీలో రూ.71,108, అంజనేయస్వామి హుండీలో రూ.35,461, వృషభాచలేశ్వర హుండీలో రూ.88,890 ఆదాయం లభించిందని కడప దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

డ్రోన్‌ఫ్లయర్స్‌తో ఫాగింగ్ ఆయిల్ స్ప్రే



డ్రోన్‌తో ఫాగింగ్ చేయిస్తున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: స్వచ్ఛతాహి సేవలో భాగంగా కడప నగరంలో దోమల వ్యాప్తిని అరికట్టే చర్యలకు నగర పాలక సిబ్బంది శ్రీకారం చుట్టారు. నాగరాజుపేట బుగ్గవంక పరిసర ప్రాంతాల్లో ఆధునిక సాంకేతికతతో డ్రోన్ ఫ్లయర్స్ సహాయంతో ఫాగింగ్ ఆయిల్ పిచికారీ, ఆయిల్‌బాల్స్ చల్లించడం, మురికి తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భరత్, రవీంద్ర, వర్కర్లు పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ...

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 18: నగరంలో రోజురోజుకూ దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రజలు రకరకాల విష జ్వరాల బారిన పడి అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు 43వ డివిజన్ కార్పొరేటరు రెడ్డిప్రసాద్, రామక్రిష్ణారెడ్డి, రవి తెలిపారు. బుధవారం కడప నగరంలోని కాగితాలపెంట, ఓల్డ్ బస్టాండు, నాగరాజుపేట తదితర ప్రాంతాల్లో దోమల నివారణకు డ్రోన్‌ల ద్వారా మందును పిచికారీ చేయించినట్లు తెలిపారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 18: చెన్నకేశవస్వామి ఆలయ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం వెల్లటూరు చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో పోతు శ్రీనివాసులరెడ్డి, బాల ఓబయ్య సహా గ్రామ ప్రజలంతా కలిసి నిరసన తెలిపారు. ప్రజలు మాట్లాడుతూ ఆక్రమణ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదనవ్యక్తం చేశారు. తక్షణం జిల్లా ఉన్నతాధికారులు విచారించి త్వరితగతిన భూమిని ఆలయానికి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

గిరి ప్రదక్షిణ సర్వపుణ్యదాయకం

వల్లూరు, సెప్టెంబరు 18: గిరిప్రదక్షిణ చేయడం సర్వం పుణ్యదాయకమని పుష్పగిరి పరిరక్షణ సమితి సభ్యులు అన్నారు. భక్తుల ఆధ్వర్యంలో ఏడాదికిపైగా పుష్పగిరి కొండపై గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. ప్రతి పౌర్ణమికి కడప జిల్లా నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా ఈ క్షేత్రానికి వచ్చి పుణ్యనదిలో స్నానాలు ఆచరించి అనంతరం శ్రీరాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వాములను దర్శించుకుంటే ఎంతో పుణ్యమని అన్నారు. బుధవారం జరిగిన గిరిప్రదక్షిణలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తమ సభ్యుల ద్వారా అన్ని చర్యలు చేపట్టారు. ఆహార, వాటర్‌పాకెట్లను అన్ని ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగుల చికిత్సకు సహకారం

అంబులెన్సును ప్రారంభించిన ఎస్పీ

కడప క్రైం సెప్టెంబరు 18: మానసిక దివ్యాంగులను గుర్తించి వారికి వైద్య చికిత్స అందించడం ద్వారా సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా మనోబంధు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం అవరణలో మనోబంధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్సును జెండా ఊపి ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల చికిత్సకు పోలీస్‌శాఖ సహకారం అందిస్తోందన్నారు. మనోబంధు ఫౌండేషన్ నిర్వాహకులు రామకృష్ణం రాజు మాట్లాడుతూ రోడ్లపై అనాథలుగా తిరుగుతున్న వారిని గుర్తించి తమ సంస్థ ఆధ్వర్యంలో రిమ్స్‌కు తరలించి సంరక్షిస్తామన్నారు. అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, ఏఆర్‌అదనపు ఎస్పీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ దుకాణాల తనిఖీ



దుకాణంలో పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టరు మాధవి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 18: మందుల దుకాణాలపై డ్రగ్ ఇన్‌స్పెక్టరు మాధవి తన బృందంతో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. మెడికల్ షాపుల లైసెన్సులు రికార్డులు పరిశీలించారు. దుకాణాల్లో నియంత్రించిన మందులను అమ్ముతున్నారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మందుల దుకాణాలపై దాడులు చేస్తుండడంతో మిగిలిన దుకాణాలు యజమానులు వాటిని మూసివేశారు. లైసెన్సులు లేకపోవడంతోనే మూసివేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిపైనా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం జనార్ధన్‌రావు

పులివెందుల టౌన్, సెప్టెంబరు 18: బ్యాంకర్లు డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని ఎల్‌డీఎం జనార్ధన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్త ప్రధానమంత్రి ఉపాధి కల్పనలో భాగంగా సబ్సిడీ లోన్లు ఇవ్వాలన్నారు. బ్యాంకులో పది రూపాయల నాణెం తీసుకోవాలన్నారు. అర్హులైన కౌలు రైతులకు, అగ్రికల్చర్ అనుబంధ రంగాలకు రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం స్వచ్ఛతా హిలో భాగంగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ఆవరణలో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం స్థానిక బాలికల కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీపీఎం ధనుంజయ్, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజరు క్రిష్ణచైతన్య, సీపీసీ కౌన్సిలర్ దివాకర్, నియోజకవర్గంలోని ఏపీఎంలు, బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిజర్వేషన్ కార్యాలయంలోకి బుకింగ్, విచారణ కౌంటర్లు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: కడప రైల్వేస్టేషన్ రిజర్వేషన్ కౌంటరులోకి బుకింగ్ ఎంక్వైరీ ఆఫీసులను తాత్కాలికంగా మార్పు నున్నట్లు కడప రైల్వేస్టేషన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పనుల కారణంగా 19వతేదీ నుంచి మార్పుతామన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

వేంపల్లె, సెప్టెంబరు 18: దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ప్రజలకు సూచించారు. బుధవారం అమ్మగారిపల్లెలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి లార్వా ఉన్నప్రదేశాల్లో అబేట్ పిచికారీ చేసి, దోమల నివారణకు సైఫనోత్రిన్ పిచికారీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరత్నం, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటలక్షుమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నాగభరణి, ఆరోగ్య కార్యకర్తలు యశోదమ్మ, సోమలింగారెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యవర్గం ఏకగ్రీవం



అకిరానందన్, తేజా

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యవర్గం ఏకగ్రీవమైంది. అధ్యక్ష కార్యదర్శులుగా బి.అకిరానందన్, బి.తేజా ఎంపికైనట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శివశంకర్, వలరాజు తెలిపారు. హోచిమన్ భవన్‌లో జరిగిన నగర సమితి సమావేశంలో నగర కమిటీని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఉపాధ్యక్షులుగా మస్తాన్, అశోక్, ఫహద్, మల్లికార్జున, సహాయ కార్యదర్శులుగా అరుణ్, చంద్ర, సల్మాన్, లోకాభిరామ్, సాయి కోశాధికారిగా రాజేశ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

చక్రాయపేటలో ఓపెన్ ఇంటర్ సెంటర్

చక్రాయపేట, సెప్టెంబరు 18: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఓపెన్ ఇంటర్మీడియేట్ సెంటర్‌ను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఓపెన్ ఇంటర్ రాష్ట్ర ఆఫీసర్ అక్బర్‌వలి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ మీ కళాశాలకు ప్రభుత్వం సైన్స్ కోర్సుల్లో 100సీట్లు,ఆర్ట్స్ కోర్సుల్లో 40సీట్లు అవకాశం కల్పించిందన్నారు. పలు అంశాలపై ప్రిన్సిపాల్, అధ్యాపకులతో చర్చించారు. ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలు రక్తహీనత బారిన పడకుండా చూసుకోవాలి

వేంపల్లె, సెప్టెంబరు 18: పిల్లలు రక్తహీనత బారిన పడకుండా ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లు, బెల్లం, ఖర్జూరం లాంటి పదార్థాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్, డాక్టర్ స్వర్ణలత, ఎంఈఓ సాధిక్ తెలిపారు. బుధవారం అమ్మవారిశాల వీధి అంగన్వాడీ సెంటర్ పౌష్టికాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ స్టాలిన్, ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, విశ్రాంత టీచర్ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎఎస్‌కె, అంగన్వాడీ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ధరణి, వైశాలితో పీఈటీ

వల్లూరు, సెప్టెంబరు 18: ఎస్‌జీఎఫ్ అండర్ 14 (బాలికల) విభాగంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు ధరణి, వైశాలి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడప స్పోర్ట్స్ స్కూలులో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కేజీబీవీలో టెన్త్, 9వ తరగతి చదువుతున్న వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ రూతు తెలిపారు.

పుత్తా పరామర్శ



ముండ్ల లక్ష్మిరెడ్డిని పరామర్శిస్తున్న పుత్తా

చెన్నూరు, సెప్టెంబరు 18: టీడీపీ సీనియర్ నేత, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులరెడ్డి తండ్రి లక్ష్మిరెడ్డిని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు కడపలో చికిత్స పొందుతున్న ఆయనను బుధవారం రాత్రి కలిసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనివాసరెడ్డి కుటుంబానికి ధైర్యం చెప్పారు. టీడీపీ మండల కన్వీనరు కెవిజయభాస్కర్‌రెడ్డి, మాజీ జిల్లా అధికార ప్రతినిధి ఇందిరెడ్డిశివారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన, జిల్లా గ్రంధాలయ మాజీ ఛైర్మన్ రామకోటిరెడ్డి, సీనియర్ నేత శివారెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి ముక్తియార్ పాల్గొన్నారు.

పాలెంపల్లిలో రైతు సంఘం సభ్యత్వం

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 10: ఏపీ రైతు సంఘం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో పాలెంపల్లిలో రైతు సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు సంఘం సభ్యత్వం ఏటా చేర్పుల్లో భాగంగా సభ్యత్వ నమోదు నిర్వహించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యవర్గ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, కొండయ్య, ఫక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి

కడప (కల్చరల్) సెప్టెంబరు 18: కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పవిత్రోత్సవాల్లో చివరి రోజు ఆలయ అర్చకులు కృష్ణమోహన్, సాయి, త్రివిక్రమ్ మహా పూర్ణాహుతి నిర్వహించారు. చతుష్టాన ఉద్వాసనలు, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణ, విద్వత్ సంభావన నిర్వహించారు. టీటీడీ దేవస్థానం ఈఓ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రీజియన్ సమస్యలను గాలికొదిలేసిన ఆర్‌ఎం

నిరసనగా 24, 25,న రిలే దీక్షలు ● సమావేశంలో ఆర్టీసీ ఎన్‌ఎంయూ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 18: ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో (కడప-మైదుకూరు-ప్రొద్దుటూరు-జమ్మలమడుగు-బద్వేల్ పులివెందుల) డిపోల్లో పనిచేస్తున్న కండక్టర్ల, డ్రైవర్ల, మెకానిక్‌ల సమస్యలను పరిష్కరించడంలో రీజనల్ మేనేజర్ స్పందించకుండా గాలికొదిలేశారని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు ధ్వజమెత్తారు. ఇందుకు నిరసనగా 24, 25 తేదీల్లో కడప రీజనల్ మేనేజర్ కార్యాలయం ఎదుట రిలేదీక్షలు తలపెట్టినట్లు వెల్లడించారు. బుధవారం ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన రీజియన్ స్థాయి ప్రత్యేక సమావేశంలో ఎన్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, రీజనల్ కార్యదర్శి సుధాకర్, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు తొండలదిన్నె జయరామ్, శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయా డిపోల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలపై పలు మార్లు రాతపూర్వకంగా, మౌఖికంగా నివేదిక అందజేసినా ఫలితం లేకపోవడం బాధాకరమన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్టీసీ పాలసీలకు పాతరేసేలా కడప రీజనల్ మేనేజర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా అక్రమ బదిలీలు, సస్పెన్షన్లు చేయడమే కాకుండా ఆయా డిపోల తాలూకు మేనేజర్లు, సూపర్‌వైజర్ల తప్పులకు మద్దతిస్తూ కండక్టర్లు, డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేసేలా నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. జమ్మలమడుగు, బద్వేల్ డిపో మేనేజర్లు తాము చెప్పిందే వేదం అన్నట్లుగా మొండివైఖరితో ఆయా డిపోల్లో ఎన్‌ఎంయూ కండక్టర్లను, డ్రైవర్ల సమస్యలను ఖాతరు చేయ కపోవడం విడ్డూరంగా వుందన్నారు. ఆ ఇద్దరూ డిపో మేనేజర్ల తీరుపై ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎన్‌ఎంయూ నేతలు, ఆరు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పూర్తయ్యేదెప్పుడు..?

●అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం ● ఇరుకు గదుల్లో విద్యార్థుల చదువులు ● విడుదల కాని నిధులు

చాపాడు, సెప్టెంబరు 18: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సరిపడే తరగతి గదులు లేక ఇరుకుగదుల్లో చదువులు కొనసాగిస్తున్నారు. గత ఏడేళ్ల నుంచి కొత్త తరగతి గదుల నిర్మాణాలకు నిధులు లేక నీరసించి పోతున్నాయి. పనులు పూర్తికాక నిలబడిపోయాయి. ఆరు పాఠశాలల్లోని తరగతి గదులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాబార్డు , సర్వశిక్షా అభియాన్, కాంపోనెంట్ ప్రత్యేక గ్రాంట్లు కింద రూ.4.92 కోట్లు మంజూరు చేశాయి. ఇందులో అధికారులు రూ.2.68 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన రూ.2.24 కోట్లు ఖర్చు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి డబ్బులు విడుదల చేయకపోవడంతో తరగతి గదుల నిర్మాణాల్లో పురోగతి లేదు. చాపాడులోని పాఠశాలకు రూ.1.11 కోట్లు మంజూరు కాగా రూ.52.44 లక్షలు, కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాలకు రూ.60 లక్షలు మంజూరు కాగా రూ.41.64 లక్షలు ఖర్చు చేశారు. చిన్నగురవలూరు గ్రామంలోని పాఠశాలకు రూ.51.46 లక్షలు రాగా రూ.24.17 లక్షలు ఖర్చు చేశారు. అయ్యవారిపల్లె పాఠశాలకు రూ.1.21 కోట్లకు గాను రూ.65.82 లక్షలు ఉపయోగించారు. నరహరిపురం పాఠశాలకు రూ.98.58 లక్షలు మంజూరు కాగా రూ.58.59 లక్షలతో తరగతి గదులు నిర్మించారు. నిర్మించిన 16 తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గదుల్లో బండ చప్పట వేయలేదు. గోడలకు రంగులు వేయలేదు. కొన్ని తరగతి గదుల్లో బండ చప్పట చదరంగా వేయలేదు. గోడలు క్యూరింగ్ చేయలేదు. అప్పుడే గోడలు నెర్రెలు చీలాయి. చాపాడులో నిర్మించిన తరగతి గదులు చాలా అధ్వానంగా ఉన్నాయి. గదుల్లో లోపలి భాగం కుంగి గుంతలు ఏర్పడ్డాయి. కాంట్రాక్టర్లు నాశిరకం పనులు చేయడంతో తరగతి గదులు బలహీనంగా ఉన్నాయి. గదులకు బిగించిన వాకిళ్లు సక్రమంగా లేవు. కింది భాగంలో సందులు ఉండడంతో విష పురుగులు తరగతి గదుల్లోకి పోయే అవకాశం ఉంది. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా నిర్మించారు. నిధులు విడుదల చేయలేదని కాంట్రాక్టర్లు నాశిరకం పనులు చేసి వదిలిపెట్టారు. అయ్యవారిపల్లె, చాపాడు, కస్తూర్బా పాఠశాలలో పనులు అలాగే నిలిచిపోయాయి. ఈ పాఠశాలల్లో అదనంగా ప్రభుత్వం జూనియర్ కాలేజీలను మంజూరు చేసింది. ఈ విద్యార్థుల చదువులకు తరగతి గదుల కొరత ఏర్పడింది. అందువలన వీరు చాలా ఇబ్బంది పడుతున్నారు. చిన్నగురవలూరులోని పాఠశాలకు అరకొరగా మరమ్మతు పనులు చేశారు. ఈ ఎనిమిది పాఠశాలల్లో సుమారు 900 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి 5 నుంచి 10 మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది. మరుగుదొడ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మొత్తానికి పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాల కొరత ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా ఈ విషయమై ఎంఈవో రవిశంకర్‌ను వివరణ అడుగగా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదన్నారు. అందువలన తరగతి గదుల నిర్మాణాలు నిలిచిపోయినట్లు చెప్పారు. నిధులు మళ్లీ రాగానే మిగిలిన పనులు చేస్తామన్నారు.



రంగులు వేయని చాపాడులోని జడ్పీ హైస్కూల్



నెర్రెలు చీలిన సిమెంటు చప్పట

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 18 : భారతీయ జనతా పార్టీ ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది. బుధవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ బైపాస్‌లో పట్టణ అధ్యక్షుడు వంకదార నరేంద్ర రావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో చలపతిరావు, పరమేశ్వరరావు, చిన్న, రమణయ్య, రవితేజ, నాగన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని లక్ష్మీపేట, కేతవరం గ్రామాల్లో బుధవారం 255 మంది బీజేపీ సభ్యత్వం తీసుకున్నట్లు బీజేపీ మైదుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాచనూరు సుబ్బరాయుడు తెలిపారు. అన్ని గ్రామాల్లో విడతల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు బొగ్గుల చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శులు సుబ్బరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, కార్యకర్తలు రమణయ్య, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల తనిఖీ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 18 : పోరుమామిళ్ల మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధి బాలికల పాఠశాల కళాశాలలను జీసీడీవో విజయలక్ష్మి పరిశీలించారు. బుధవారం ఆమె ఆ పాఠశాల, కళాశాలను తనిఖీ చేసి సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. విద్యాసంబంధమైన అంశాలపై చర్చించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 18 : చెన్నారెడ్డిపేట గ్రామానికి చెందిన బాలిరెడ్డి(53) సీతారామపురం స్కూలులో ఎస్‌జీటీగా విధులు నిర్వహించేవాడు. కాగా బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం గుండెనొప్పి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందాడని డాక్టర్లు ధృవీకరించారు. చెన్నారెడ్డిపేటలో ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు. ఎంఈవో, ఉపాధ్యాయులు, పోరుమామిళ్ల రీజియన్ ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొని నివాళులర్పించారు.

ఫారెస్టు భూములపై జాయింట్ సర్వే

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 18 : పెన్నా నదితీరం వెంబడి ఫారెస్టు భూములున్నాయని ఫారెస్టు గెజిట్‌లోవుందని ఫారెస్టు అధికారులు సర్వే చేయాలని కోరారు. ఆమేరకు కలెక్టర్ శివశంకర్ ఆదేశాలతో తహసీల్దారు గంగయ్య డిప్యూటి సర్వేయర్ గురివిరెడ్డి, వీఆర్‌వో రవిప్రకాష్ ఫారెస్టు అధికారులు పోలీసులు జాయింట్ సర్వేను బుధవారం మొదలు పెట్టారు.

నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుక అమ్మకాలు

కొండాపురం, సెప్టెంబరు 18: మండలంలోని ఏటూరు ఇసుక స్టాక్‌పాయింట్‌ను గురువారం నుంచి తిరిగి ప్రారంభించనున్నట్లు జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం ద్వారా గురువారం నుంచి ఎవరైనా ఇసుకను బుక్ చేసుకోవచ్చని ఆర్డీవో తెలిపారు. ఏటూరు ఇసుకరీచ్ వద్ద గండికోట బ్యాక్‌వాటర్ రావడంతో కొన్ని రోజులుగా ఇసుక అమ్మకాలను నిలిపి వేశారు. ఇసుకను రీచ్ నుంచి స్టాక్‌పాయింట్‌కు డంపింగ్ చేసి తిరిగి ప్రారంభిస్తున్నారు. రామిరెడ్డిపల్లె వద్ద కూడా మరో స్టాక్‌పాయింట్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

23 లోగా రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి

కొండాపురం, సెప్టెంబరు 18: రైతులు తప్పని సరిగా ఈ నెల 23 లోపల ఈ-క్రాప్ చేయించుకోవాలని ఏవో ఏవీ రామాంజులరెడ్డి తెలిపారు.స్థానిక రైతుసేవా కేంద్రంలో బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో మహేంద్రారెడ్డి, రైతుసేవా కేంద్రం ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం పై శిక్షణ

ముద్దనూరు సెప్టెంబరు18: స్థానిక వ్యవసాయ క్షేత్రంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి బుధవారం పంట కోత ప్రయోగం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.అందులో భాగంగా ఏవో వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్లాట్‌లను ఎంపిక చేసుకొని రైతుల సమక్షం పంట కోత ప్రయోగం చేపట్టాలన్నారు.ఈకేవైసీ వందశాతం పూర్తిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటసుబ్బయ్య,ఎఎస్‌వో నవతేజ పాల్గొన్నారు.

గోపవరం..: పంటకోతపై రైతు సేవాకేంద్రం ఇన్‌చార్జీలు సమగ్రంగా చేయాలని ఏడీ నాగరాజు అన్నారు. గోపవరం మండల రైతు సేవా కేంద్రం సహాయకులకు వ్యవసాయాధికారులకు పంట కోత ప్రయోగాలపై వ్యవసాయ గోడౌన్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

జమ్మలమడుగు, సెప్టెంబరు 18: జమ్మలమడుగు పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ప్రభుత్వ ఆస్పత్రికి సమీపాన అన్న క్యాంటీన్ గురువారం సాయంత్రం 7.30 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని నగర పంచాయతీ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది

జమ్మలమడుగు, సెప్టెంబరు 18: కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట కాంట్రాక్టు సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కాంట్రాక్టు పోస్టులలో ఇతరులను నియమించడం జీవో విడుదల చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీవో నెం.115ను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు వెంచర్లువేసిన చెరువు భూమి పరిశీలన



చెరువు స్థలం పరిశీలిస్తున్న తహసీల్దారు

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 18 : తాళ్ళమాపురం పొలం పరిధిలోని ప్రైవేటు వెంచర్లు వేసిన చెరువు భూమిని తహసీల్దారు వండాడి గంగయ్య పరిశీలించారు. బుధవారం ఆర్‌ఐ నాగ మోహన్‌రెడ్డి, వీఆర్‌వో నరసింహులు కలిసి సర్వేయర్లతో చెరువు భూమిని కొలతలు వేశారు. గతంలో చెరువు వుందని చెరువును ఆక్రమించి ప్రైవేటు వెంచర్లు వేశారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు తహసీల్దారు వండాడి గంగయ్య క్షేత్ర స్థాయిలో చెరువు కొలతలను తీయమని సర్వేయర్లను ఆదేశించారు.

నర్సన్నపల్లెలో హెల్త్ క్యాంపు



కాశినాయన సెప్టెంబరు18: మండలంలోని నర్సన్నపల్లెలో బుధవారం డాక్టరు ప్రశాంతి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన విజృంభిస్తున్న విషజ్వరాలు కథనంలో నర్సనపల్లెలో జ్వరపీడితులపై వచ్చింది. వైద్యారోగ్య సిబ్బంది గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి రోగులకు చికిత్సలు అందజేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి లార్వాను గుర్తించి పలువురి రక్తనమూనాలను సేకరించారు.ఈకార్యక్రమంలో సీహెచ్‌వో నిర్మల, పీహెచ్‌ఎన్ శారద,ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య,హుస్సేనమ్మ,చంద్రశేఖర్ శర్మ తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మద్యాన్ని విక్రయిస్తే చర్యలు

ఖాజీపేట, సెప్టెంబరు 18: హైవేలో రాత్రివేళల్లో మద్యాన్ని అక్రమంగా అమ్మితే చర్యలు తప్పవని సీఐ మోహన్ అన్నారు. బుధవారం పాటిమీదపల్లె టోల్‌ప్లాజా వద్ద గల అంగళ్ల యజమానులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారికి రాత్రివేళల్లో మద్యం అమ్మితే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు ఇష్టానుసారంగా నడపడంతో వారి ప్రాణం పోవడమే కాక ఇతరుల ప్రాణాలు కూడా పోతాయన్నారు. మద్యాన్ని అమ్ముతున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవన్నారు.

గంజాయి తాగే ప్రాంతాలపై తనిఖీలు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 18 : మండల కేంద్రంలోని గంజాయి తాగే ప్రాంతాలైన పోలేరమ్మ గుడి, కాశినాయన గుడి, కక్కయ్యమఠం ప్రాంతాలను గంజాయి తాగేప్రదేశాలుగా గుర్తించి అక్కడ తనిఖీ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం సీఐ రమణారెడ్డి పర్యవేక్షణలో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మురళి, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 18 : పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.5480 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐకొండారెడ్డి తెలిపారు. బుధవారం పోరుమామిళ్లలోని గోవిందరెడ్డినగర్ కంప చెట్ల వద్ద జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మద్యం తాగి ఆటో నడుపుతున్న వ్యక్తిని అరెస్టు చేసి ఆటోసీజ్ చేశామన్నారు. బహిరంగప్రదేశాల్లో మద్యం తాగుతున్న 9 మందిపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా చండీ హోమం



ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 18: అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం గణపతి, నవగ్రహ, చండీ హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, వేద పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

బి.మఠంలో శ్మశానం ఆక్రమణలు తొలగించాలి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 18 : మండల కేంద్రంలో శ్మశానం ఆక్రమణలకు గురైందని తొలగించి ప్రహరీ నిర్మించాలని, బ్రహ్మంసాగర్ లీకేజీల నివారణకు శాశ్వత కాంక్రీట్ వాల్ చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఎం జిల్లాకార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి సానా గోవింద్ ఆధ్వర్యంలో రెండోరోజు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి గండిసునీల్‌కుమార్, సీపీఎం మైదుకూరు మండల కార్యదర్శి షరీఫ్, లక్షుమయ్య, బాలరాజు, బి.రమణమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేశ్ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో ఊరేగుతున్న బొజ్జ గణపయ్య

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 18 : మండల కేంద్రంలోని వీరనారాయణపురం గ్రామంలో 11 రోజులుగా పూజలందుకుని బుధవారం అంగరంగవైభవంగా భక్తిశ్రద్ధలతో కమిటీ సభ్యులు గణనాథున్ని గ్రామ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు చెక్కభజన, కోలాటాన్ని గురువు ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం బ్రహ్మంసాగర్‌లో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుధా సప్లయర్స్ అధినేత ముక్కమల భాస్కర్‌రెడ్డి, ఉమాపతి, సుంకు సురేశ్‌తో పాటు కమిటీ సభ్యులు వీరనారాయణపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లలితాదేవికి ఘనంగా కుంకుమార్చన



ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 18: పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాలవేంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి, శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి సామూహికంగా అమ్మవారి చిత్రపటానికి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. సామూహిక లలిత సహస్రనామ పారాయణం చేశారు.

నారాపురం వేంకటేశ్వరస్వామికి పౌర్ణమి వేడుకలు



ఊరేగుతున్న నారాపురం వేంకటేశ్వరస్వామి

జమ్మలమడుగు, సెప్టెంబరు 18: జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో టీటీడీ శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తాదులు శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టణంలో రథంపై ఊరేగింపు చేశారు. అలాగే ఆలయంలో గర్భగుడి చుట్టూ ప్రాకార మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అర్చకుడు శ్రీనాథస్వామి, శ్రీవారి సేవా సమితి అధ్యక్షుడు సుధాకర్‌గుప్త, కమిటీ సభ్యులు జి.రాధాకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసగుప్త, రామచౌడయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు జోక్యంతో తాత్కాలికంగా నీరు మళ్లింపు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 18 : తహసీల్దరు చంద్రశేఖర్‌రెడ్డి జోక్యంతో ఓ ప్రైవేటు పాఠశాల వెనుక వైపు నిండుకుండలా ఉన్న నీటిని తాత్కాలికంగా మళ్లించే చర్యలు చేపట్టారు. పోరుమామిళ్లలో వర్షం కురిసినప్పుడు అన్ని వీధుల్లోకి మురికినీరంతా ఓ ప్రైవేటు పాఠశాల వెనుక వైపు నిల్వ ఉండి చెరువును తలపిస్తుండడంతో సంబంధిత పాఠశాల యాజమాన్యం ఇరిగేషన్ అధికారుల దృష్టికి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఈ సంఘటనాస్థలాన్ని పరిశలించిన తహసీల్దారు తెలుగుగంగ అధికారులు రవిచంద్ర ఆ చుట్టుపక్కల పంట కాల్వలు ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, పాఠశాలా యాజమాన్యం పాండురంగారెడ్డి, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరు అందిస్తాం

ఖాజీపేట, సెప్టెంబరు 18: కేసీ కెనాల్ కొండపేట కాలువ చివరి ఆయకట్టుకు నీరు అందిస్తామని ఏఈ సుబ్బరాయుడు అన్నారు. బుధవారం కొండపేట కాలువలోని పాటిమీదపల్లె తూములు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువకు అక్రమంగా పెట్టిన మోటార్లను రైతులు స్వచ్ఛందంగా తీసివేయాలన్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందించడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యాభివృద్ధే స్వచ్ఛతాహీ సేవా లక్ష్యం



గోపవరం, ప్రొద్దుటూరులో ఆయిల్‌బాల్స్ వేస్తున్న అధికారులు

గోపవరం, సెప్టెంబరు 18 : ఆరోగ్యాభివృద్ధే స్వచ్ఛతాహీ సేవా ప్రధాన లక్ష్యమని గోపవరం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ అన్నారు. గోపవరం గ్రామ పంచాయతీలో స్వచ్ఛతాహీ సేవా రెండోరోజు కార్యక్రమాన్ని సంగ సముద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు టీచర్లు, హరిత రాయబారులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు మండలంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నందు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించారు. అనంతరం పాఠశాలలో స్వచ్ఛతహి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీల్లో భాగణా పరుగు పందెం పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామ్మోహన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు 1 కే పరుగు పందెంను చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఎస్.ప్రభాకర్‌రావు, జ్యోతి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: స్వచ్ఛభారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నదే ఉద్దేశ్యమని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ నగిలి ప్రకాశ్‌రావు అన్నారు. బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.కాగా పోరుమామిళ్లలో రంగసముద్రం పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డి, ఎంపీడీవో వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మోటరు బైకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

రాజుపాలెం..: గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు సీడీపీవో అరుణకుమారి పిలుపునిచ్చారు. బుధవారం చిన్నశెట్టిపల్లె గ్రామంలో స్వచ్ఛరహిత సేవా కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రం ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీకేంద్రాల సూపర్ వైజరు విజయేశ్వరి, పంచాయతీకార్యదర్శి సుబ్బరా జమ్మ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని కమిషనర్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోకుల్ నగర్ -1 ఆయిల్ బాల్స్ చల్లారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ చర్యలు చేపట్టారు. ఉదయం మారదాన్ 2కెరన్, దోమలు వృద్ధి చెందకుండా నీటి నిలువ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్, మలాథిన్ మందుతో పిచికారీ చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించి కాలువల్లో శుభ్రతకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట..: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. బుధవారం స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులతో బస్టాండు కూడలి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, సెక్రటరీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.